
సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

సోమవారం । 24 । అక్టోబర్ । 2022

మత్స్యగెడ్డ అందాలు అదరహో



ఆంధ్ర-ఒడిశా రాష్ట్రాల సరిహద్దు ప్రాంతంలో ప్రవహిస్తున్న మత్స్యగెడ్డ అందాలు ప్రకృతి ప్రియులను విశేషంగా ఆకట్టుకుంటున్నాయి. పనసపుట్టు ప్రాంతంలో ఎత్తయిన కొండలపై నుంచి కనిపిస్తున్న ఈ దృశ్యం దీవులను తలపిస్తూ మంత్రముగ్ధులను చేస్తోంది. – ముంచంగిపుట్టు

మత్తుమందు ఇచ్చి నగల అపహరణ



అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న అనిగి మారమ్మకు మత్తుమందు ఇచ్చి, ఆమె వద్ద నున్న నగలు అపహరించి తండ్రీకూతురు పరారైన ఘటన చింతూరు మండలం కుమ్మూరులో చోటు చేసుకుంది. IIలో

న్యూస్‌రీల్

దీపావళి శుభాకాంక్షలు

- జిల్లా ప్రజలకు తెలిపిన కలెక్టర్, ఎంపీ, ఎమ్మెల్యేలు

సాక్షి,పాడేరు : దీపావళి పండగను జిల్లా ప్రజలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరుపుకోవాలని కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆకాంక్షించారు. జిల్లా ప్రజలకు ఆయనతో ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో వి.అభిషేక్ ఒక ప్రకటనలో శుభాకాంక్షలు తెలిపారు. అరకు ఎంపీ గొడ్డేటి మాధవి, పాడేరు, అరకులోయ, రంపచోడవరం ఎమ్మెల్యేలు కొట్టగుళ్లి భాగ్యలక్ష్మి, చెట్టి పాల్గుణ, నాగులపల్లి ధనలక్ష్మి, జడ్పీ, జీసీసీ చైర్‌పర్సన్‌లు జల్లిపల్లి సుభద్ర, డాక్టర్ శోభ స్వాతిరాణి, ఏపీ మెడికల్ కౌన్సిల్ సభ్యుడు డాక్టర్ తమర్బ నర్సింగరావు, రాష్ట్ర ట్రైకార్ చైర్మన్ సతక బుల్లిబాబులు కూడా జిల్లాలోని అన్ని వర్గాల ప్రజలకు దీపావళి శుభాకాంక్షలు తెలిపారు.

ప్రశాంతంగా దీపావళి వేడుకలు

- ఏఎస్పీ ప్రతాప్ కిషోర్
- జవాన్లకు టపాసుల పంపిణీ



జవాన్లకు టపాసులు అందజేస్తున్న ఏఎస్పీ ప్రతాప్ కిషోర్

చింతపల్లి రూరల్: దీపావళి వేడుకలు ప్రశాంతంగా జరుపుకోవాలని ఏఎస్పీ ప్రతాప్ కిషోర్ కోరారు. మండలంలోని రాళ్లగడ్డ ఏవోబీలో ఆదివారం ఆయన కుటుంబసమేతంగా పర్యటించారు. సీఆర్పీఎఫ్ జవాన్లకు మిఠాయిలు, టపాసులు అందజేశారు. ఈ కార్యక్రమంలో ఏఎస్పీ సతీమణి ధాత్రి రెడ్డి (ఐఏఎస్), చింతపల్లి ఇన్‌చార్జి సీఐ సన్యాసినాయుడు, అన్నవరం ఎస్‌ఐ సాయికుమార్, సివిల్ పోలీసులు పాల్గొన్నారు.

సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ

సాక్షి,పాడేరు : అనకాపల్లిలో ప్రభుత్వం నూతనంగా ఏర్పాటు చేసిన ఎంఎస్ఎంఈ టెక్నాలజీ సెంటర్‌లో పలు సర్టిఫికెట్ కోర్సుల్లో ఉచిత శిక్షణ అందిస్తున్నామని ఉమ్మడి విశాఖ జిల్లా సీడాప్ మేనేజర్ ఎ.కళ్యాణి జగదీశ్వరి ప్రకటనలో తెలిపారు. మాస్టర్ సర్టిఫికెట్ కోర్సు ఇన్ మెకట్రానిక్స్, ప్రొడక్ట్ డిజైన్, సీఎస్‌సీ టెక్నాలజీలో ఆరు నెలలపాటు శిక్షణ అందిస్తామని పేర్కొన్నారు. డిప్లమో (5/6 సెమిస్టర్), బీటెక్ (5/6 సెమిస్టర్) మెకానికల్, ప్రొడక్ట్ ఇంజనీరింగ్, ఎలక్ట్రికల్, ఆటోమొబైల్ ఇంజనీరింగ్ అభ్యర్థులు శిక్షణకు అర్హులన్నారు. శిక్షణ కాలంలో ఉచిత భోజనం, వసతి సదుపాయం ఉంటుందని, శిక్షణ అనంతరం ఉద్యోగావకాశాలు కల్పిస్తామన్నారు. ఆసక్తి గల అభ్యర్థులు ఈ నెల 25న పాడేరు వెలుగు కార్యాలయంలో జరిగే ఎంపికకు అన్ని ధ్రువపత్రాలతో హాజరు కావాలని కోరారు. వివరాలకు 6303000080, 9492572737 నంబర్లలో సంప్రదించాలని సూచించారు.

ఎస్ఈబీ సీఐగా రాజు బాధ్యతల స్వీకరణ



చింతపల్లి రూరల్: స్థానిక స్పెషల్ ఎన్‌ఫోర్సుమెంట్ బ్యూరో (ఎస్ఈబీ) స్టేషన్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా వై.రాజు నియమితులయ్యారు. చింతపల్లి ఎస్ఈబీ సీఐ పోస్టు ఏడాదిగా ఖాళీగా ఉంది. కొంత కాలంగా దీర్ఘకాల సెలవులో ఉన్న సీఐ రాజుని ఎస్ఈబీ ఉన్నతాధికారులు చింతపల్లి సీఐగా పోస్టింగ్ ఇచ్చారు. ఈమేరకు ఆయన బాధ్యతలు చేపట్టారు.

నేడు సింహగిరిపై నరకాసుర వధ



సింహాచలం: నరకచతుర్దశి, దీపావళిని పురస్కరించుకుని సోమవారం సింహగిరిపై నరకాసుర వధ ఉత్సవాన్ని నిర్వహించేందుకు దేవస్థానం వైదిక, అధికారులు ఏర్పాట్లు చేశారు. రాత్రి ఆరాధన అనంతరం ఈ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. నరకాసురుడి విగ్రహాన్ని ఒక పల్లకిలోను, శ్రీవరాహ లక్ష్మీనృసింహస్వామి ఉత్సవమూర్తులు గోవిందరాజస్వామి, శ్రీదేవి, భూదేవిలను మరో పల్లకిలో వేంచేపుచేసి సింహగిరి మాడవీధిలో ఎదురెదురుగా ఉంచి నరకాసుర వధ ఉత్సవాన్ని నిర్వహించనున్నారు. యుద్ధ సన్నివేశాలు, నరకాసుర వధ ఘట్ట విన్నపం పూజలు, అనంతరం పెద్ద ఎత్తున బాణసంచా కాలుస్తారు. దీంతో సాయంత్రం 6 గంటల వరకే అప్పన్న స్వామి దర్శనాలు భక్తులకు లభిస్తాయని దేవస్థానం అధికారులు తెలిపారు.



కోటి కాంతుల రవళి
దీపావళి

కష్ట సుఖాల సమాహారం జీవితం. ఎల్లకాలం కష్టాలు మనతో ఉండవని.. కష్టించి పనిచేస్తే వెలుగులోకి రావచ్చనే సత్యాన్ని లోకానికి చాటి చెప్పడమే దీపావళి ఉద్దేశం. కోటికాంతుల దీపాలతో అమావాస్యను పటాపంచలు చేసే ఈ దీపావళి రోజునే లక్ష్మిదేవి తమ ఇంట్లో కలకాలం నిలవాలని లక్ష్మీపూజ జరపడం ఆచారం. భిన్నత్వంలో ఏకత్వాన్ని సృజించే ఈ దీపావళి కోటికాంతుల కేళి. కొత్త ఆశలతో, ఆశయాలతో ఈ దీపావళి వెలుగురేఖలు మన జీవితాలలో ప్రసరించాలని మనసారా కోరుకుందాం.

కొనసాగుతున్న కనిష్ట ఉష్ణోగ్రతలు

- చింతపల్లిలో 14.8
- అరకులోయలో 15.5
- మినుములూరులో 16 డిగ్రీలు నమోదు



పాడేరు అంబేద్కర్ సెంటర్‌లో దట్టంగా పొగమంచు

సాక్షి,పాడేరు : జిల్లాలోని పాడేరు డివిజన్ పరిధిలో వాతావరణం చల్లబడుతోంది. మూడు రోజుల నుంచి పాడేరు, అరకులోయ, చింతపల్లి ప్రాంతాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయి. ఆదివారం చింతపల్లి వ్యవసాయ పరిశోధన స్థానంలో 14.8 డిగ్రీలు, అరకులోయ కేంద్ర కాఫీబోర్డులో 15.5 డిగ్రీలు, పాడేరు మండలం మినుములూరు కేంద్ర కాఫీబోర్డులో 16 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదయ్యాయి. అర్ధరాత్రి నుంచి ఉదయం 8గంటల వరకు ఏజెన్సీలోని అన్ని ప్రాంతాల్లోను పొగమంచు దట్టంగా కురిసింది. చలిగాలులు వణికించడంతో పర్యాటకులు, స్థానికులు ఇబ్బందులు పడ్డారు.

త్వరలో విద్యార్థి గర్జన



జేఏసీ, విద్యాసంస్థల ప్రతినిధులతో సమావేశమైన ప్రభుత్వ విప్ ధర్మశ్రీ

- జేఏసీ పిలుపుతో మద్దతు ప్రకటించిన విద్యాసంస్థలు
- మూడు రాజధానుల సాధనే లక్ష్యం

చోడవరం: మూడు రాజధానులకు మద్దతుగా చోడవరంలో భారీ విద్యార్థి గర్జన సభ ఏర్పాటు చేయాలని జేఏసీ, విద్యాసంస్థల ప్రతినిధులు నిర్ణయించారు. చోడవరం జేఏసీ పిలుపు మేరకు చోడవరం ఫోర్‌ఎస్ కాలేజీ ఆవరణలో విద్యాసంస్థల యాజమాన్యాలు, విద్యార్థి సంఘాల నాయకులతో ఆదివారం సమావేశం నిర్వహించారు. 'విశాఖ రాజధాని విద్యార్థుల హక్కు' నినాదంతో త్వరలో చోడవరంలో భారీ విద్యార్థి గర్జన సభ నిర్వహించాలని ఈ సందర్భంగా సమావేశం నిర్ణయించింది. జేఏసీ కన్వీనర్ కాండ్రేగుల డేవిడ్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో ప్రభుత్వ విప్ కరణం ధర్మశ్రీ మాట్లాడుతూ విశాఖలో రాజధాని రాకుండా కొన్ని క్షుద్రశక్తులు అడ్డుపడేందుకు చేస్తున్న ప్రయత్నాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు.

విదేశాలకు..
మన శీకాకాయ

ఏజెన్సీలో ఆదివాసీలు సేకరించే శీకాకాయకు మంచి డిమాండ్ ఏర్పడింది. ఇక్కడ సహజ సిద్ధంగా లభ్యమయ్యే సీకాకాయలో నాణ్యత ప్రమాణాలు ఉన్నందున వినియోగంపై విదేశీయులు ఆసక్తి చూపుతున్నారు. దీంతో ఇప్పుడు ఒక్కసారిగా గిరాకీ ఏర్పడింది. దీనిని ఆదాయ వనరుగా మార్చుకున్న గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి మార్కెట్లో కన్నా అధిక ధరకు కొనుగోలు చేస్తోంది. పౌడర్‌గా తయారు చేసి అమెరికాకు ఎగుమతి చేసేందుకు ముందుకు వచ్చిన వెంచర్ సంస్థకు మంచి ధరకు సరఫరా చేస్తోంది. ఇందుకు గాను ఐదేళ్లకు అగ్రిమెంట్ చేసుకుంది.

- అమెరికాకు సరఫరా
- వెంచర్ సంస్థతో గిరిజన సహకార సంస్థ ఒప్పందం
- ఐదేళ్లపాటు సరఫరాకు అగ్రిమెంట్
- గిరిజనులకు స్థానిక ధర కన్నా ఎక్కువగా చెల్లింపు
- జీసీసీకి మెరుగైన ఆదాయం
- తొలివిడతగా 4వేల కిలోల సేకరణ



శీకాకాయను గ్రేడింగ్ చేస్తున్న కార్మికులు

రంపచోడవరం: మన్యంలో సహజ సిద్ధంగా, సేంద్రియ పద్ధతుల్లో పండే శీకాకాయకు ఎంతో డిమాండ్ ఉంది. దీనిని స్థానికంగానే పోటీ పడి కొనుగోలు చేస్తారు. ఇది రంపచోడవరం, మారేడుమిల్లి, చింతూరు, వై.రామవరం మండలాల్లో విరివిగా లభిస్తోంది. రోజురోజుకు డిమాండ్ పెరగడమే కాకుండా మంచి ఆదాయ వనరుగా మారడంతో మారేడుమిల్లి మండలంలోని లోతట్టు ప్రాంతాల్లో సేకరణ మొదలైంది.

ఐదేళ్ల పాటు సరఫరాకు ఒప్పందం

అమెరికాకు ఎగుమతి చేయడానికి ముందుగా గిరిజన సహకార సంస్థ గిరిజనుల నుంచి కొనుగోలు చేస్తోంది. దీనిని హైదరాబాద్‌కు చెందిన వెంచర్ ఎక్స్ఛేంజ్ సంస్థకు సరఫరా చేస్తుంది. అక్కడి నుంచి అమెరికాకు ఎగుమతి అవుతోంది. ఈ మేరకు గిరిజన సహకార సంస్థ ఆ సంస్థ ఐదేళ్లపాటు సరఫరా చేసేందుకు అగ్రిమెంట్ చేసుకుంది.

కిలో రూ.55 చొప్పున చెల్లింపు..

స్థానిక మార్కెట్లలో కిలో రూ. 30 నుంచి 40 ధర ఉండే శీకాకాయకు ఇప్పుడు జీసీసీ కిలో.55 చొప్పున చెల్లిస్తోంది. పౌడర్‌గా మార్చి కిలో రూ.118 చొప్పున వెంచర్ సంస్థకు సరఫరా చేస్తోంది. దీనివల్ల ఒకపక్క గిరిజనులకు, మరోపక్క గిరిజన సహకార సంస్థకు ఆదాయ వనరులు మెరుగుపడ్డాయి.

తొలి విడతగా 4 వేల కిలోలు..

మొదటి విడతగా నాలుగు వేల కేజీల శీకాకాయను గిరిజన సహకార సంస్థ సేకరించింది. దీనిని రంపచోడవరం జీసీసీ గొడౌన్‌లో గ్రేడింగ్ చేస్తున్నారు. తరువాత మెషీన్ ద్వారా పౌడర్ తయారు చేసి ప్యాకెట్ల రూపంలో వెంచర్ సంస్థకు సరఫరా చేస్తామని జీసీసీ అధికారులు తెలిపారు.

మారేడుమిల్లి మండలంలోని జీఎంవలస, కుందాడ, మల్లిశాల, ముంజుమామిడి గ్రామాల నుంచి శీకాకాయను సేకరిస్తున్నారు. ప్రస్తుతం జీసీసీ గిరిజనులకు కిలోకు రూ. 55 ధర చెల్లిస్తోంది. గ్రేడింగ్, పౌడరు అనంతరం 25 కేజీల ప్యాకెట్ తయారు చేసి వెంచర్ సంస్థకు అందజేస్తోంది. ఇందుకు గాను ఆ సంస్థ కిలోకు రూ.158 చెల్లిస్తోంది. ఈ సంస్థ సభ్యులు గ్రామాల్లో సందర్శించి శీకాకాయ నాణ్యతను పరిశీలించారు. ఎగుమతికి అవసరమైన నాణ్యమైన ప్రమాణాలు ఉన్నందున ఐఎస్‌ఐ ధ్రువపత్రం మంజూరైంది.

ప్రత్యేక పద్ధతుల్లో సేకరణ

అడవుల్లో సహజ సిద్ధంగా లభించే శీకాకాయ సేకరణలో గిరిజనులకు జీసీసీ అధికారులు ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. శీకాకాయ నాణ్యత దెబ్బతినకుండా పాకిన చెట్టు చుట్టూ టార్పాలిన్ ఏర్పాటుచేయాలి. ఆ తరువాత దులిపిన శీకాకాయను సేకరించిన గిరిజనులు జీసీసీకి అందజేస్తారు. గిరిజనులు సేకరిస్తున్న శీకాకాయలు తేనె రంగులో పొడవుగా ఉన్నాయి.

గిరిజనులు, జీసీసీకి ఆదాయం

ఏజెన్సీలో శీకాకాయ సహజ సిద్ధంగా లభ్యమవడం వల్ల మంచి డిమాండ్ ఉంది. మారేడుమిల్లి ప్రాంతంలో లభ్యత ఎక్కువగా ఉంది. గిరిజనుల నుంచి కొనుగోలు చేసి గ్రేడింగ్ చేస్తున్నాం. పౌడర్ ప్యాకెట్లను వెంచర్ సంస్థకు సరఫరా చేస్తున్నాం. దీనివల్ల గిరిజనులు సేకరించే శీకాకాయకు మార్కెటింగ్ మెరుగుపడింది. జీసీసీకి కూడా మెరుగైన ఆదాయం లభించనుంది. ఎగుమతికి అవసరమైన ప్రమాణాలన్నీ ఉన్నాయి.

– జె.యూటష్, డీఎం, జీసీసీ, రంపచోడవరం

పర్యాటకం కళకళ



చాపరాయి జలపాతం వద్ద సందడి చేస్తున్న పర్యాటకులు

జిల్లాలోని పర్యాటక ప్రాంతాలు కిటకిటలాడాయి. వరుసగా రెండు రోజులు సెలవు కావడంతో కుటుంబ సమేతంగా తరలివచ్చారు. బొర్రా గుహలు, వంజంగి హిల్స్, అరకు గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్, వ్యూ పాయింట్లు, జలపాతాలు సందడి మారాయి. ప్రకృతి అందాలను తిలకిస్తూ ఉత్సాహంగా గడిపారు.

రంపచోడవరం: సీతపల్లి బాపనమ్మ ఆలయానికి ఆదివారం భక్తులు అధిక సంఖ్య వచ్చారు. అమ్మవారిని దర్శించుకుని మొక్కులు చెల్లించారు. ఆలయ కమిటీ చైర్మన్ బొబ్బా శేఖర్ మాట్లాడుతూ ఆలయానికి వచ్చిన భక్తులకు ఎటువంటి ఇబ్బంది లేకుండా అన్ని ఏర్పాట్లు చేసినట్లు తెలిపారు. ప్రభుత్వం, భక్తుల సహకారంతో ఆలయాన్ని అభివృద్ధి చేస్తున్నామని ఆయన పేర్కొన్నారు.

లంబసింగిలో..

చింతపల్లి రూరల్: ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగిలో ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. ఈ ప్రాంతంలో కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదుతోపాటు మంచు దట్టంగా కురుస్తోంది. ఈ అందాలను తిలకించేందుకు పర్యాటకుల రాకతో సందడి నెలకొంది.

బొర్రాకు రూ.3 లక్షల ఆదాయం

అనంతగిరి/అరకులోయ రూరల్: మండలంలోని ప్రముఖ పర్యాటక కేంద్రమైన బొర్రాగుహలకు పర్యాటకులు పోటెత్తారు. గతవారం ఆదివారం రెండు వేల మంది తిలకించారు. ఈ ఆదివారం 3500 మంది పర్యాటకులు గుహలను సందర్శించారు. సుమారు రూ.3 లక్షల మేర ఆదాయం వచ్చిందని మేనేజర్ గౌరీ శంకర్ తెలిపారు. డముకు వ్యూపాయింట్, కటికి, తాటిగుడ, సరియా జలపాతాల వద్ద పర్యాటకులతో సందడిగా మారింది.

గిరిజన మ్యూజియం, పద్మాపురం గార్డెన్‌కు..

అరకు గిరిజన మ్యూజియాన్ని 1330 మంది తిలకించగా రూ.61 వేల ఆదాయం వచ్చింది. పద్మాపురం గార్డెన్‌ను 1293 మంది తిలకించగా, రూ.67,450 ఆదాయం వచ్చిందని అధికారులు తెలిపారు. రణజిల్లెడ జలపాతం వద్ద పర్యాటకులు సందడి చేశారు. ట్రైబల్ మ్యూజియం ముఖద్వారాన్ని అనుకుని ఏర్పాటు చేసిన ఐ లవ్ అరకు బోర్డు వద్ద పర్యాటకులు ఫొటోలు, సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు.



బొర్రా గుహల అందాలను తిలకిస్తున్న పర్యాటకులు

పాలసముద్రాన్ని తలపించేలా..

హుకుంపేట: జెండాకొండ (సీతమ్మ పర్వతం)ను తిలకించేందుకు ఆదివారం పర్యాటకులు భారీగా తరలివచ్చారు. పాలసముద్రాన్ని తలపించే మంచు అందాలు, అందమైన మేఘాలు, సూర్యోదయం, ప్రకృతి రమణీయతను వారు తిలకించారు. గుడ్డిగుమ్మి, హుండీ,గొడుగురాయి జలపాతాల వద్ద పర్యాటకులు సందడి చేశారు.

మారేడుమిల్లికి పర్యాటకుల తాకిడి


మారేడుమిల్లి : సందర్శకుల తాకిడితో మారేడుమిల్లి ఆదివారం కళకళలాడింది. రెండు రోజులు వరుస సెలవులు రావడంతో పలు దూర ప్రాంతాల నుంచి పర్యాటకుల అధిక సంఖ్యలో తరలివచ్చారు. పర్యాటక ప్రదేశాలైన జలతరంగిణి, అమృతధార దుంప. ధారవాడ జలపాతాలు, వనవిహారి, వాలీసుగ్రీవ్ వనమూలికల ప్రదేశం, జంగిల్ స్టార్, పాములేరు, మన్యం వ్యూపాయింట్స్ వద్ద సందడి నెలకొంది. బొంగు చికెన్, బిర్యానీ, కబాబుల అమ్మకాలు భారీగా జరిగాయి. పర్యాటకుల వాహనాలతో స్థానిక మెయిన్ సెంటర్ నుంచి సోమిరెడ్డిపాలెం వరకు రద్దీ నెలకొంది.

చీకుధార జలపాతానికి..

రాజవొమ్మంగి: మండలంలోని అమ్మిరేఖల సమీపంలో రక్షిత అటవీప్రాంతంలో గల చీకుధార జలపాతానికి ఆదివారం పర్యాటకుల తాకిడి పెరిగింది. రాజమహేంద్రవరం, కాకినాడ వంటి సుదూర ప్రాంతాల నుంచి ప్రత్యేక వాహనాల్లో తరలివచ్చారు. సెల్ఫీలు తీసుకుంటూ సందడి చేశారు. జలపాతంలో స్నానాలు చేస్తూ కేరింతలు కొట్టారు.



జలతరంగిణి జలపాతం వద్ద పర్యాటకుల సందడి



జెండాకొండపై పాలసముద్రాన్ని తలపిస్తున్న మంచు అందాలు

అభివృద్ధి చేస్తే అపురూపమే!



జలపాతం ఎగువన పవర్ ప్రాజెక్ట్‌కు నీటి మళ్లింపు నిమిత్తం నిర్మించిన అడ్డుగోడపై నుంచి ఉరకలేస్తున్న ప్రవాహం

- ఆకట్టుకుంటున్న పింజరికొండ జలపాతం
- వసతులు కల్పిస్తే మరింత ఆదరణ

అడ్డతీగల: చుట్టూ ఎత్తయిన కొండలు.. వాటి నడుమ ఒంపు సొంపులతో బండరాళ్లపైనుంచి జాలువారుతూ పింజరికొండ జలపాతం ఆకట్టుకుంటోంది. మండలంలోని పింజరికొండ వద్ద అద్భుతమైన జలసోయగం ఆవిష్కృతమైంది. ప్రకృతి ప్రేమికులను మంత్రముగ్ధులను చేస్తోంది. పింజరి కొండ వరకు కొండల మధ్య నుంచి ఒంపులు తిరుగుతూ ప్రవహించే ఏలేరు వాగు బండరాళ్లపై నుంచి జాలువారుతూ జలపాతాన్ని తలపిస్తోంది. సెలవు దొరికితే చాలా ఈ ప్రాంతాన్ని సందర్శించేందుకు పర్యాటకులు తరలివస్తున్నారు. ఆధ్యాత్మిక కేంద్రంగాను ఈ జలపాతం ప్రసిద్ధి చెందింది. ఏటా శివరాత్రి పర్వదినాన భక్తులు ఇక్కడకి వచ్చి వాగులో పుణ్యస్నానాలు ఆచరిస్తారు. బండరాళ్ల మధ్య శివునికి ప్రత్యేక పూజలు నిర్వహించి బండరాయి మధ్యలో ఏర్పడిన రంధ్రంలో పడేలా విసురుతారు. రంధ్రంలో పడితే నీటి ప్రవాహంలో కొలువైన మడుగు మల్లేశ్వరస్వామి చెంతకు ప్రసాదం చేరినట్టుగా వారు విశ్వసిస్తారు. అడ్డతీగలకు ఏడు కిలోమీటర్ల దూరంలో ఉన్న ఈ ప్రాంతం కార్తీకమాసం వనభోజనాలతో సందడిగా ఉంటుంది. పర్యాటకుల తాకిడిని దృష్టిలో పెట్టుకుని ఇక్కడ సౌకర్యాలు కల్పించాల్సిన అవసరం ఉంది. పర్యాటకులకు ఏది అవసరమైనా ఏడు కిలోమీటర్ల దూరంలోని అడ్డతీగల వెళ్లాల్సిందే. ఈ ప్రాంతంలో పర్ణశాల, పల్నాటి పౌరుషం, మనసిచ్చి చూడు, నిధి, వర్ణ తదితర సినిమాలను చిత్రీకరించారు.

రేపు ఉదయం 9గంటల వరకే అప్పన్న దర్శనం

సింహాచలం: సూర్య గ్రహణం కారణంగా సింహగిరిపై వరాహ లక్ష్మీ నృసింహస్వామి దర్శనం మంగళవారం ఉదయం 9 గంటల వరకే లభిస్తుందని దేవస్థానం ఈవో వి.త్రినాథరావు తెలిపారు. అనంతరం ఆలయ కవాటబంధనం చేస్తారు. తిరిగి 26వ తేదీ ఉదయం 6.30 గంటల నుంచి భక్తులకు దర్శనాలు లభిస్తాయని పేర్కొన్నారు. భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

26 నుంచి తిరునక్షత్రం పూజలు

ఆర్జిత సేవలు రద్దు

సింహాచలం: సింహగిరిపై శ్రీ వరాహ లక్ష్మీ నృసింహస్వామి ఆలయంలో ఈ నెల 26వ తేదీ నుంచి 30వ తేదీ వరకు మనవాళ మహామునుల(పెరియ జీయార్) తిరు నక్షత్రం పూజలు శాస్త్రోక్తంగా నిర్వహిస్తున్నట్లు ఆలయ ఏఈవో ఆనంద్‌కుమార్ తెలిపారు. ఈ సందర్భంగా 26 నుంచి 30వ తేదీ వరకు స్వాతిహోమం, సహస్రనామార్చన, స్వర్ణ పుష్పార్చన, స్వర్ణతులసీ దళార్చన, గరుడసేవ, నిత్య కల్యాణం సేవలు రద్దు చేసినట్టు పేర్కొన్నారు. భక్తులంతా ఈ విషయాన్ని గమనించాలని కోరారు.

క్లుప్తంగా

వరాహ నదిలో పడి యువకుడి మృతి



వరాహనదిలో పడి మృతి చెందిన రమణ

ఎస్.రాయవరం: వమ్మవరం సమీపంలో వరాహ నదిలో ప్రమాదవశాత్తూ పడి ఓ యువకుడు మృతి చెందినట్టు ఎస్‌ఐ ప్రసాద్ రావు తెలిపారు. గోకులపాడు గ్రామానికి చెందిన సమ్మింగి రమణ(23) కాలకృత్యాలు తీర్చుకోవడానికి శనివారం నది వద్దకు వెళ్లి, ప్రమాదానికి గురైనట్టు చెప్పారు. కేసు నమోదు చేసి, దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పర్యాటకులకు గాయాలు

మారేడుమిల్లి: మారేడుమిల్లి –చింతూరు ఘాట్ రోడ్డులో ఆదివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు పర్యాటకులకు తీవ్ర గాయాలయ్యాయి. కాకినాడ జిల్లా జగ్గంపేటకు చెందిన యువరాజు, లోకేష్ కుమార్ అనే ఇద్దరు యువకులకు బైక్‌పై మారేడుమిల్లికి విహార యాత్రకు వచ్చారు. అమృతధార జలపాతాన్ని సందర్శించి అక్కడి నుంచి తిరిగి మారేడుమిల్లి వస్తుండగా మన్యం వ్యూ పాయింట్ సమీపంలో ఎదురుగా వస్తున్న లారీని తప్పించబోయి రోడ్డు పక్కన ఉన్న కొండను ఢీ కొన్నారు. ఈ ప్రమాదంలో ఆ యువకులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు.

తలమానికంగా...

- రూ.35 కోట్లతో రూపుదిద్దుకుంటున్న స్వాతంత్ర్యసమర యోధుల మ్యూజియం

చింతపల్లి: జిల్లా సిగలో మరో అపురూప కట్టడం చేరనుంది. మండలంలోని తాజంగిలో రూ.35 కోట్లతో చేపట్టిన గిరిజన స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం జిల్లాకు తలమానికంగా నిలువనుంది. మరో కొద్ది నెలల్లో పనులు పూర్తి చేసేలా ప్రణాళికపరంగా చర్యలు తీసుకుంటున్నామని సంబంధిత అధికార వర్గాలు చెబుతున్నాయి. ఆంధ్రా కశ్మీర్‌గా గుర్తింపు పొందిన లంబసింగి ప్రాంతానికి ఏటా శీతాకాలంలో వేలాది మంది పర్యాటకులు వస్తుంటారు. ఇక్కడ మంచు అందాలను తిలకించి మైమరచిపోతుంటారు. సముద్ర మట్టానికి సుమారు 3,600 అడుగుల ఎత్తులో ఉన్న లంబసింగికి చేరుకోగానే దట్టంగా కమ్ముకున్న మంచు అందాలు స్వాగతం పలుకుతాయి. అక్కడ నుంచి చెరువులవేనం కొండలకు వెళ్లి పాలసంద్రాన్ని తలపించేలా కనువిందు చేసే మంచు అందాలను తిలకిస్తారు. అక్కడ నుంచి తాజంగి జలాశయానికి చేరుకుని బోటు షికారు, జిప్ లైనర్ షికారు చేసి పర్యాటకులు మధురానుభూతి పొందుతారు. పర్యాటకంగా అభివృద్ధి చెందుతున్న లంబసింగి ప్రాంతంలో గిరిజన స్వాతంత్ర్య సమర యోధుల మ్యూజియం నిర్మించాలని రాష్ట్ర, కేంద్ర ప్రభుత్వాలు నిర్ణయించాయి. రాష్ట్ర వాటాగా రూ.20 కోట్లు, కేంద్ర నిధులు రూ.15 కోట్లతో నిర్మాణ పనులు చేపట్టాయి. దీనిని 22.6 ఎకరాల విస్తీర్ణంలో మ్యూజియం నిర్మిస్తున్నారు. ప్రదర్శన శాల ప్రధాన భవనాన్ని అల్లూరి సీతారామరాజు, ఆయన అనుచరులు గాం గంటందొర, గాం మల్లుదొరలు స్వాతంత్ర్య పోరాటంలో వినియోగించిన ఆయుధాలు గుర్తుకు తెచ్చేలా ఉండనుంది. ఇందుకు రూ.13 కోట్లు కేటాయించారు. యాంపి థియేటర్‌తో పాటు డిజిటల్ టెక్నాలజీ, వీడియో, ఆడియో విధానాలకు రూ.5 కోట్లు కేటాయించారు. మ్యూజియం గోడలు, పైకప్పులకు గిరిజన సంప్రదాయ కళాకృతులతో అలంకరించనున్నారు. రూ.10 కోట్లతో మ్యూజియం పరిసర ప్రాంతాలను ఉద్యానవనంగా తీర్చిదిద్దనున్నారు. మరో రూ.6 కోట్లతో గిరిజన సంస్కృతిని ప్రతిబింబించేలా ఆధునికమైన రిసార్ట్స్, రెస్టారెంట్లను ఏర్పాటు చేయనున్నారు.



పిల్లర్ల దశలో ప్రదర్శనశాల భవనం

నాలుగు జోన్లుగా..

మ్యూజియాన్ని ఏ,బీ,సీ,డీ జోన్లుగా విభజించి వివిధ అంశాలను ప్రదర్శిస్తారు.

- జోన్-ఏ లో మూడు గ్యాలరీల్లో బ్రిటీష్ పాలకులు రాకముందు గిరిజనుల పరిస్థితులు, జీవన విధానం, ఆర్థిక పరిస్థితులు, సంస్కృతి తెలయజేసేలా విధంగా ప్రదర్శనలు ఉంటాయి.



తాజంగిలో నిర్మిస్తున్న స్వాతంత్ర్య సమరయోధుల మ్యూజియం

- జోన్-బీ లో బ్రిటీష్ పాలకులు చొరబడిన తరువాత మారిన పరిస్థితులు ప్రదర్శిస్తారు. వృక్ష, జంతు, జలాలకు సంబంధించి ఆడియో, వీడియో ప్రదర్శనలు కళ్లకు కట్టినట్టు ప్రదర్శిస్తారు.
- జోన్-సీలో బ్రిటిష్ పాలకులు గిరిజనులపై సాగించిన అరాచకాలు, తిరుగుబాటు, స్వాంతంత్ర్యం కోసం అడవి బిడ్డలు చేసిన త్యాగాలు ప్రదర్శనలో ఉంటాయి.
- జోన్-డీలో ప్రస్తుతం రాష్ట్రంలో ఉన్న గిరిజనుల జీవన విధానాలు, నేర్చుకోవలసిన అంశాలు ప్రదర్శనలో ఉంటాయి. సమరయోధుల విగ్రహాలు కూడా ఏర్పాటు చేయనున్నారు.

త్వరితగతిన పూర్తి చేస్తాం

మ్యూజియం పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. వీలైనంత త్వరగా నిర్మాణం పనులు పూర్తి చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. మూజియం పూర్తయితే పర్యాటకంగా ఈ ప్రాంతం మరింత అభివృద్ధి చెందుతుంది.

– చాణక్య, గిరిజన సంక్షేమ శాఖ డీఈఈ, చింతపల్లి

సిరసపల్లిలో భారీ చోరీ

- రూ. 74 వేల నగదు, బంగారం అపరణ

అనకాపల్లిటౌన్: మండలంలో సిరసపల్లిలో భారీ చోరీ జరిగినట్టు ఆదివారం రూరల్ పోలీసులకు ఫిర్యాదు అందింది. ఎస్‌ఐ నరసింగరావు అందించిన వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన పి.విజయరాణి, భర్త వినోద్‌బాబు విజయవాడలో ఉంటున్నారు. ఇంట్లో ఎవరూ లేని సమయంలో చోరీ జరిగింది. చోరీ జరిగిన విషయాన్ని గుర్తించిన చుట్టుపక్కలవారు విజయరాణికి ఫోన్‌లో సమాచారం తెలిపారు. ఏడు రకాలైన బంగారు ఆభరణాలు, రూ.74వేల నగదు కలిపి, మొత్తం రూ.2.74 లక్షల సొత్తు చోరీకి గురైనట్టు బాధితులు ఫిర్యాదులో పేర్కొన్నారు. కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన తెలిపారు.

యువ ఉత్సవ్‌లో గిరిజన విద్యార్థి ప్రతిభ



ఎమ్మెల్సీ మాధవ్ చేతుల మీదుగా బహుమతి అందుకుంటున్న కళ్యాణ్

అరకులోయ : నెహ్రూ యువ కేంద్ర ఆధ్వర్యంలో విశాఖపట్నంలో నిర్వహించిన యువ ఉత్సవ్-2022లో స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి బి.కళ్యాణ్ ప్రతిభ చూపాడు. కళాశాలలోని జాతీయ సేవా పథకం యూనిట్ 1,2 నుంచి యువ ఉత్సవ్‌కు పలువురు విద్యార్థులు హాజరయ్యారు. వక్తృత్వ పోటీల్లో కళ్యాణ్ ఉత్తమ ప్రతిభ కనబరిచాడు. ఈ సందర్భంగా కళ్యాణ్ను ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీ మాధవ్ బహుమతి అందజేశారు. ఢిల్లీలో జరగనున్న యువ పార్లమెంట్‌కు కళ్యాణ్ ఎంపికై నట్టు ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్‌కుమార్ నాయక్ తెలిపారు.విద్యార్థి కళ్యాణ్‌కు ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, నాగబాబు, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది తదితరులు అభినందనలు తెలిపారు.

అత్తింటి వారి వేధింపు వల్లే నూర్జహాన్ మృతి

- బంధువుల ఆరోపణ
- మృతదేహాన్ని తరలించకుండా అడ్డుకుని ఆందోళన
- పరిస్థితిని చక్కదిద్దిన సీఐ, ఎస్ఐలు

చోడవరం రూరల్: మండలంలోని వెంకన్నపాలెంలో వివాహిత నూర్జహాన్ మృతికి అత్తింటి వారి వేధింపులే కారణమని, వారిని శిక్షించాలని డిమాండ్ చేస్తూ మృతురాలి బంధువులు పెద్ద ఎత్తున ఆందోళన చేశారు. వెంకన్నపాలెంలో గ్రామ వలంటీర్ షేక్ నూర్జహాన్ శనివారం మృతి చెందిన విషయం తెలిసిందే. ఆదివారం పోస్టుమార్టం అనంతరం వెంకన్నపాలెంలోని అత్త వారింటికి మృతదేహాన్ని తీసుకువచ్చారు. ఆ సమయంలో మృతురాలి బంధువులు అడ్డగించారు. అత్తింటి వేధింపుల కారణంగానే నూర్జహాన్ నెల రోజుల క్రితం సబ్బవరం మండలం మల్లునాయుడుపాలెంలోని తల్లిదండ్రుల ఇంటికి చేరిందని చెప్పారు. పెద్దలను, బంధువులను ఒప్పించి భార్యాపిల్లలను భర్త ఇస్మాయిల్ తిరిగి తన ఇంటికి తీసుకు వచ్చాడని తెలిపారు. అంతలోనే మరణించిందని, దీనికి భర్త ఇస్మాయిల్, అత్త అమీనాబీబీ, మామ ఇషాక్ అహ్మద్‌లే కారణమని వారు విరుచుకుపడ్డారు. ఈ విషయం తెలుసుకున్న చోడవరం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ యమున తమ సిబ్బందితో వెంకన్నపాలెం చేరుకుని పరిస్థితిని చక్క దిద్ది, మృతదేహాన్ని అంత్యక్రియలకు తరలించారు. ఎస్ఐ, సిబ్బంది గ్రామంలోనే ఉండి పరిస్థితి అదుపు తప్పకుండా చర్యలు తీసుకున్నారు. మృతురాలి భర్త,అత్త,మామలను చోడవరం పోలీసు స్టేషన్‌కు తరలించారు. పోలీస్‌స్టేషన్ వద్ద కూడా మృతురాలి బంధువులు ఆందోళన చేశారు.



పోలిస్ స్టేషన్ వద్ద ఆందోళనకు దిగిన బంధువులు

అమరవీరుల త్యాగాలు మరువలేనివి



చింతూరులో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



అడ్డతీగలలో కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు



అనంతగిరిలో ర్యాలీలో పాల్గొన్న ఎస్‌ఐ కరక రాము, సిబ్బంది, విద్యార్థులు

చింతూరు: విధి నిర్వహణలో ప్రాణాలు అసువులు బాసిన పోలీసు అమరవీరుల త్యాగాలు మరువలేనివని చింతూరు ఏఎస్పీ మహేశ్వరరెడ్డి అన్నారు. పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవం సందర్భంగా ఆదివారం రాత్రి చింతూరులో విద్యార్థులతో కలసి కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఏఎస్పీ మాట్లాడుతూ శాంతి భద్రతలను కాపాడేందుకు విధి నిర్వహణలో ఎంతోమంది పోలీసులు ప్రాణత్యాగం చేసారని, వారి సేవలను ప్రతిఒక్కరూ గుర్తుచేసుకోవాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సీఆర్పీఎఫ్ ఈ-42 బెటాలియన్ అసిస్టెంట్ కమాండెంట్ దివాకర్, సీఐ అప్పలనాయుడు, ఎస్‌ఐ యాదగిరి పాల్గొన్నారు.

అడ్డతీగల: పోలీసు అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా ఆదివారం రాత్రి అడ్డతీగలలో పోలీసులు కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. అడిషినల్ ఎస్‌ఐ ఎస్.హనుమంతరావు, ఏఎస్‌ఐ ఎం.శ్రీనివాసరావు ఆధ్వర్యంలో కానిస్టేబుళ్లు స్థానిక పోలీస్‌స్టేషన్ నుంచి సీతపల్లి జంక్షన్ వరకూ పోలీసు అమరవీరులు జోహార్లు అంటూ నినదిస్తూ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించారు.

అనంతగిరి: ప్రజా రక్షణలోని నిమగ్నమై విధి నిర్వహణలోని అసువులు బాసిన పోలీసులు అమరవీరుల త్యాగాలను గుర్తు చేసుకోవాలని అనంతగిరి ఎస్‌ఐ కరక రాము అన్నారు. మండల కేంద్రంలోని ఆదివారం సాయింత్రం పోలీసు సిబ్బంది, విద్యార్థులతో కలిసి అమరవీరుల త్యాగాలను స్మరిస్తూ కొవ్వత్తుల ర్యాలీ చేపట్టారు. అనంతరం ఎస్‌ఐ కరక రాము మాట్లాడుతూ ప్రజా రక్షణలోని అనేక మంది పోలీసులు ప్రాణాలను కోల్పోయారని, శాంతి భద్రతలో పోలీసులు ముఖ్యపాత్ర పోషిస్తున్నారని కొనియాడారు. అమరులైన కుటుంబాలకు ప్రభుత్వం, పోలీసుశాఖ అండగా ఉంటుందన్నారు. పోలీస్ సిబ్బంది, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

పాడేరు రూరల్ : పోలీసు అమరవీరుల సంస్మరణ దినోత్సవాన్ని పురస్కరించుకొని ఆదివారం రాత్రి పాడేరు పట్టణంలో పోలీసులు శాంతి ప్రదర్శన చేపట్టారు. స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్ నుంచి అంబేడ్కర్ సెంటర్ కూడలి వరకు ఈ ర్యాలీ చేపట్టారు. జిల్లా ఎస్పీ సతీష్‌కుమార్ ఆదేశాల మేరకు ఈనెల 31 వరకు పోలీసు అమరవీరులకు నివాళులర్పించేందుకు వివిధ కార్యక్రమాలు చేపడుతున్నట్టు సీఐ సుధాకర్ తెలిపారు. ఎస్‌ఐలు లక్ష్మణ్, రంజిత్‌కుమార్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



పాడేరులో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు

'మందుగుండు' సీతారామయ్య



మందుగుండు సీతారామయ్య దంపతులు (ఫైల్)



బాణసంచా సామగ్రి

అనకాపల్లి టౌన్: బుద్ధ సీతారామయ్య షాపు ఎక్కడని అడిగితే తెలియదనే సమాధానం వస్తోంది. అదే 'మందుగుండు' సీతారామయ్య షాపు ఎక్కడని అడిగితే ఇట్టే ఠక్కున చెప్పేస్తారు. అంతలా ఆయన పేరు ప్రజల మదిలో స్థిరపడిపోయింది. తనకు తెలిసిన వారు ఒడిశా నుంచి తీసుకొచ్చిన బాణసంచా సామగ్రిని చూసి, అదే వృత్తిగా మార్చుకోవడంతో శతాబ్దంగా వెలుగులు పంచుతోంది.

1920లో అనకాపల్లికి చెందిన ఉప్పల వంశస్తులు ఒడిశా రాష్ట్రం కటక్ నుంచి బాణసంచా తీసుకొచ్చి వెలిగించారు. అది చూసిన సీతారామయ్య తానెందుకు తయారు చేయడకూడదనే ఆలోచించారు. ఆపై నేర్చుకుని తయారు చేయడం మొదలు పెట్టారు. అయితే ఈయన తయారు చేసిన బాణసంచా సామగ్రికి 1942లో అధికారికంగా అనుమతి పొందారు. అప్పటి నుంచి రాష్ట్ర, జాతీయ స్థాయిలో పేరు ప్రఖ్యాతులు సంపాదించడంతో బుద్ధ సీతారామయ్య పేరు కాస్త మందుగుండు సీతారామయ్యగా స్థిరపడిపోయింది. ఆయన మరణాంతరం ప్రస్తుతం తన కుటుంబ సభ్యుల్లో ఒకరిద్దరు తప్ప అందరూ ఇదే వృత్తిలో కొనసాగుతున్నారు.

ఏడాది పొడవునా బాణసంచా అమ్మకాలు...

ఇక్కడ దుకాణంలో చిచ్చుబుడ్లు, తారాజువ్వలు, మతాబులు, మిన్నలు, టపాసులు తయారు చేస్తుంటారు. ప్రస్తుతం 50 మంది కార్మికులకు ఉపాధి కల్పిస్తున్నారు. సీతారామయ్య పేరు ప్రఖ్యాతులు సాధించుకోవడంతో వీరి పాత్ర ఉందని చెబుతుంటారు. ఎక్కడైనా శుభ, అశుభ కార్యక్రమాలకు, దసరా, వినాయక నవరాత్రులకు బాణసంచా కాల్చారంటే, అది సీతారామయ్య షాపులోనిదే అని ఇట్టే చెప్పేస్తుంటారు.

పేలుడు పదార్థాలకు దూరం

మా తాతల కాలం నుంచి బాణసంచా సామగ్రి వృత్తిగా జీవనం సాగిస్తున్నాం. ప్రజల వినోదాన్ని పంచేందుకే వీటిని తయారు చేస్తున్నాం. కనువిందు చేసే వాటికే ప్రాధాన్యమిస్తున్నాం. భారీ శబ్దం వచ్చేవి తాము నిషేధించాం.

– శివాజీ, (సీతారామయ్య అల్లుడు) అనకాపల్లి

374 మందికి కంటి పరీక్షలు

అచ్యుతాపురం(అనకాపల్లి): అచ్యుతాపురం మండలంలోని బ్రాండిక్స్ అపెరల్ పార్క్ సిటీలో ఆదివారం ఉచిత నేత్ర వైద్య శిబిరం నిర్వహించారు. శంకర్ ఫౌండేషన్ వైద్యులు 374 మందికి కంటి పరీక్షలు చేశారు. 274 మందికి ఉచితంగా కళ్లద్దాలు, 72 మందికి మందులు పంపిణీ చేశారు. 35 మందికి కాటరాక్ట్ సర్జరీ, నలుగురికి ఇతర శస్త్రచికిత్సలు అవసరమని నిర్ధారించారు. కంటి పరీక్షలకు హాజరైన వారిలో 15 మంది చిన్నారులు ఉన్నారు. సామాజిక ఆరోగ్య సంరక్షణలో భాగంగా ప్రతీ వారం ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామని బ్రాండిక్స్ భారత భాగస్వామి దొరైస్వామి తెలిపారు. ఈ శిబిరంలో రోగులకు బ్రాండిక్స్ యాజమాన్యం మజ్జిగ, ఫలహారం, భోజన సదుపాయాలు కల్పించింది.

సుధాకర్‌ను గెలిపించి ఉత్తరాంధ్ర సత్తా చాటాలి

- ప్రభుత్వ విప్, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు కరణం ధర్మశ్రీ



మాట్లాడుతున్న ప్రభుత్వ విప్ ధర్మశ్రీ. వేదికపై ఎమ్మెల్యే బాబూరావు, ఎమ్మెల్సీ అభ్యర్థి సుధాకర్

నక్కపల్లి/ఎస్.రాయవరం: ఉత్తరాంధ్ర పట్టభద్రుల ఎమ్మెల్సీగా సీతంరాజు సుధాకర్‌ను గెలిపించి, ఆ విజయాన్ని ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి కానుకగా ఇవ్వడంతోపాటు, ఉత్తరాంధ్ర ప్రజల సత్తా చూపించాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ విప్, చోడవరం ఎమ్మెల్యే కరణం ధర్మశ్రీ పిలుపునిచ్చారు. ఎస్.రాయవరం మండలం అడ్డురోడ్డు వేంకటేశ్వరకల్యాణ మండపంలో పాయకరావుపేట ఎమ్మెల్యే గొల్ల బాబూరావు అధ్యక్షతన ఎమ్మెల్సీ అభ్యర్థి సీతంరాజు సుధాకర్ పరిచయ కార్యక్రమం ఆదివారం జరిగింది. ఈ కార్యక్రమానికి నాలుగు మండలాలనుంచి పలువురు పట్టభద్రులు, పార్టీ శ్రేణులు హాజరయ్యారు.ఈ సందర్భంగా ధర్మశ్రీ మాట్లాడుతూ ఏదైనా డిగ్రీ పూర్తి చేసిన పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేసే బాధ్యత కార్యకర్తలు తీసుకోవాలన్నారు. ప్రజాప్రతినిధులు, నాయకులు సమన్వయం చేసుకుని పట్టభద్రుల నుంచి పూర్తి చేసిన దరఖాస్తులను తీసుకుని ఎంఆర్‌వో కార్యాలయం అందజేయాలని, లేదా ఆన్‌లైన్‌లో అప్‌లోడ్ చేయాలని తెలిపారు. ఇక్కడ ఎమ్మెల్సీగా సుధాకర్‌ను గెలిపించడం ద్వారా ఉత్తరాంధ్ర అభివృద్ధిని కాంక్షిస్తూ విశాఖను పరిపాలనా రాజధాని చేసుకునేందుకు మరింతగా ఉద్యమించే అవకాశం కలుగుతుందన్నారు. ఎమ్మెల్యే గొల్ల బాబూరావు మాట్లాడుతూ సుధాకర్‌కు దాదాపుగా 30 ఏళ్లనుంచి వైఎస్సార్ కుటుంబంతో సన్నిహిత సంబంధాలు ఉన్నాయన్నారు. ఎన్నికల్లో వైఎస్సార్, ఆయన తనయుడు జగన్ మోహన్‌రెడ్డి అధికారంలోకి రావడానికి, వారు బలపరచిన అభ్యర్థుల విజయానికి ఎంతో కృషి చేశారన్నారు. ప్రజా సమస్యలపై పూర్తి అవగాహన కలిగిన సుధాకర్‌ను గెలిపించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఓటర్లనమోదుకు గడువు సమీపిస్తోందని, నాయకులంతా దీనిపై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. ఎమ్మెల్సీ అభ్యర్థి సీతం రాజు సుధాకర్ మాట్లాడుతూ తనకు వైఎస్సార్ కుటుంబంతో మూడు దశాబ్దాల నుంచి పరిచయం ఉందన్నారు. ఓటర్ల నమోదుపై కార్యకర్తలు, నాయకులు దృష్టిపెట్టాలని, నవంబరు ఏడోతేదీలోగా పూర్తి చేయాలన్నారు. కంపెనీల్లో పనిచేసే ఉద్యోగుల కోసం ప్రత్యేకంగా పోలింగ్ బూత్‌లు ఏర్పాటు చేసే అవకాశం ఉందని చెప్పారు. ఈ కార్యక్రమంలో జిల్లావ్యవసాయ సలహామండలి చైర్మన్ చిక్కాలరామారావు, జెడ్పీటీసీ సభ్యుడు లంక సూరిబాబు, ఎంపీపీ ఇసరపు పార్వతి తాతారావు, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర అదనపు కార్యదర్శి దత్తుడు సీతబాబు, వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు బాబూరావు తదితరులు పాల్గొన్నారు.

మత్తుమందు ఇచ్చి నగల అపహరణ

చింతూరు: అంగన్‌వాడీ ఆయాగా పనిచేస్తున్న అనిగి మారమ్మకు మత్తుమందు ఇచ్చి, ఆమె వద్దనున్న నగలు అపహరించి తండ్రీకూతురు పరారైన ఘటన చింతూరు మండలం కుమ్మూరులో ఆదివారం చోటు చేసుకుంది. ఆయా భర్త గంగరాజు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గతంలో కుమ్మూరులో ఆర్ఎంపీగా పనిచేసిన ఓ వ్యక్తి తన భార్య మృతి చెందిందంటూ పదేళ్ల కుమార్తె రమ్యతో కలసి నాలుగు రోజుల క్రితం గ్రామానికి వచ్చాడు. పాత పరిచయాలను సాకుగా చూపి గ్రామంలోని ఓవ్యక్తి ఇంట్లో ఉంటూ వైద్యం చేయసాగాడు. కాగా వారి ఇంటిపక్కనే ఉంటున్న అంగన్‌వాడీ ఆయా మారమ్మ ఆదివారం పశువులు మేపేందుకు సమీపంలోని పొలాల్లోకి వెళ్లింది. ఆమెతో పాటు సదరు వ్యక్తి కూతురు రమ్య కూడా పొలానికి వెళ్లింది. కొంతసేపటి తరువాత ఆ వ్యక్తి వచ్చి కూల్‌డ్రింక్‌లో మత్తుమందు కలిపి మారమ్మతో తాగించాడు. దీంతో ఆమె అపస్మారక స్థితిలోకి వెళ్లి అక్కడే పడిపోయింది. అనంతరం ఆ వ్యక్తి మారమ్మ మెడలో బంగారు గొలుసు, చెవిదిద్దులు, వెండి పట్టీలు అపహరించుకుని కూతురితో సహా పరారైనట్టు మారమ్మ భర్త తెలిపాడు. సాయంత్రం సమయంలో పొలంలో అపస్మారక స్థితిలో పడి ఉన్న మారమ్మను గమనించిన స్థానికులు స్థానిక ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రి సిబ్బంది ఇచ్చిన సమాచారం మేరకు వివరాలు సేకరించినట్టు ఎస్‌ఐ యాదగిరి తెలిపారు.

క్లుప్తంగా

పశువులకు వ్యాధి నిరోధక టీకాలు



తంటికొండలో పశువులకు లంపీ స్కిన్ నిరోధక టీకాలు వేస్తున్న సిబ్బంది

రాజవొమ్మంగి: మండలంలోని రాజవొమ్మంగి, గింజర్తి, ఎర్రంపాడు, వట్టిగెడ్డ, తంటికొండ గ్రామాల్లోని 300 తెల్లజాతి పశువులకు లంపీస్కిన్ వ్యాధి నిరోధక టీకాలు వేసినట్టు పశువైద్యాధికారి తరుణ్ తెలిపారు. ప్రతి గ్రామంలో తెల్లజాతి పశువులకు ఈ వ్యాక్సిన్ అందజేస్తామని, రైతులు తమ సిబ్బందికి సహకరించాలని కోరారు. వ్యాధులు ప్రబలుతున్న తరుణంలో పశువులను బయటకు వదిలి పెట్టవద్దని సూచించారు. మండలానికి తొలివిడతగా 2,500 డోసుల వ్యాక్సిన్ వచ్చిందన్నారు. తంటికొండ గ్రామంలో జరిగిన వ్యాక్సినేషన్ కార్యక్రమంలో సర్పంచ్ ఆగూరి శుభలక్ష్మి, ఉప సర్పంచ్ పల్లి వెంకటరమణ, పశువైద్యసహాయకులు కిషోర్, ప్రవీణ్, రవి, వలంటీర్లు రాజేశ్వరి, శ్రీను, జేకే ట్రస్టుకు చెంది వంశీ పాల్గొన్నారు.

విద్యార్థులకు పుస్తకాలు, పెన్నుల పంపిణీ



విద్యార్థులకు పుస్తకాలు, పెన్నులు అందజేస్తున్న మాణిక్యం, జ్ఞానమ్మ దంపతులు

అరకులోయ రూరల్: పెదలబుడు పంచాయతీ బొండగుడ గ్రామంలో హార్ట్ ఆఫ్ జీసస్ క్రైస్ట్ మినిస్ట్రీస్ అండ్ వెల్ఫేర్ సొసైటీ వ్యవస్థాపకుడు బారికి మాణిక్యం, జ్ఞానమ్మ దంపతులు ఆదివారం పేద విద్యార్థులకు సుమారు 20 మందికి నోటు పుస్తకాలు, పెన్నులు, అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పేద విద్యార్థులను ఆదుకునేందుకు దాతలు ముందుకు రావాలని కోరారు. తమ కుమార్తె జీవన మాధురి జన్మదిన వేడుకలను పురస్కరించుకొని ఈ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. శాంతి, రూతు, ధర్మ, డానియేలు తదితరులు పాల్గొన్నారు.

ప్లాస్టిక్ నిషేధంపై అవగాహన



మాట్లాడుతున్న సర్పంచ్ పుష్పలత, చిత్రంలో అధికారులు, వైఎస్సార్‌సీపీ నాయకులు

చింతపల్లి రూరల్: మండల కేంద్రంలో ప్లాస్టిక్ నిషేధంపై గ్రామ వలంటీర్లు ప్రజలకు అవగాహన కల్పించాలని సర్పంచ్ దురియా పుష్పలత అన్నారు. గ్రామ వలంటీర్లుతో ఆమె ఆదివారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్లాస్టిక్ నిషేధంపై నవంబర్ 1 నుంచి అంక్షలు కఠినంతరం చేస్తున్నామన్నారు. దుకాణాల్లో ప్లాస్టిక్ కవర్లు, గ్లాసులు, 120 మైక్రాన్లు కంటే తక్కువ కలిగిన పాలిథిన్ సంచులు వినియోగించొద్దన్నారు.
ప్రతి దుకాణం వద్ద జోట్ బ్యాగులు అందుబాటులో ఉంచాలన్నారు. మేజర్ పంచాయతీని ప్లాస్టిక్ రహిత ప్రాంతంగా ఉంచేందుకు ప్రజలు సహకరించాలన్నారు. వ్యాపారస్తులు నిబంధనలు పాటించకపోతే కఠిన చర్యలు తీసుకుంటామన్నారు. ఈవోపీఆర్‌డీ శ్రీనివాస రావు తదితరులు పాల్గొన్నారు.

అమ్మవారికి ప్రత్యేక పూజలు



భక్తులకు ప్రసాదం అందజేస్తున్న దృశ్యం

పాడేరు రూరల్ : పాడేరు మోదకొండమ్మ తల్లి ఆలయంలో ఆదివారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్థానికులతో పాటు మైదాన ప్రాంతాల నుంచి భక్తులు అధిక సంఖ్యలో వచ్చి పూజల్లో పాల్గొన్నారు. భక్తులకు ప్రసాద పంపిణీ నిమిత్తం పాడేరుకు చెందిన భక్తుడు బాబూరావు కుటుంబ సభ్యులు రూ.2వేలను ఆలయ కమిటీ ప్రతినిధులకు అందజేశారు. ఆయా సొమ్ముతో భక్తులకు ప్రసాదాన్ని పంపిణీ చేశారు.

మూగజీవాలకు ముప్పు

- పశువులకు ప్రాణాంతక వ్యాధులు సోకే అవకాశం
- రైతులు అప్రమత్తంగా ఉండాలని పశువైద్యుల సూచనలు



మేకలకు టీకాలు వేస్తున్న సిబ్బంది



పశువుకు చికిత్స చేస్తున్న సిబ్బంది

దుంబ్రిగుడ: గత కొద్ది రోజులుగా మన్యంలో భారీ వర్షాలే పడుతున్నాయి. పశువులకు ప్రాణాంతక వ్యాధులు సంక్రమించే అవకాశముంది. ఈ సమయంలో పశువులకు సోకే వ్యాధులపై రైతాంగం అప్రమత్తంగా ఉండాలి. రోగాలపై ఏమాత్రం అశ్రద్ధ వహించినా పశువులు మృత్యువాత పడే ప్రమాదముందని పశువైద్యాధికారులు హెచ్చరిస్తున్నారు. రైతులు జాగ్రత్త వహించి పశువులను కాపాడుకోవాలని కోరుతున్నారు. పశువైద్య సిబ్బంది ప్రతి రైతు భరోసా కేంద్రాల వద్ద కానీ, పశు సంపద ఉన్న ప్రదేశాల్లో కానీ పశువైద్య శిబిరాలను నిర్వహించి, నివారణా చర్యలు తీసుకుంటున్నారు. ఈ కాలంలో సోకే వ్యాధుల లక్షణాలు, నివారణ మార్గాలను ఏడీ అశ్వత్థామ వివరించారు. చిన్న టీకాతో ఈ వ్యాధులను నయం చేయవచ్చని చెబుతున్నారు.

పశువుల్లో వ్యాధి లక్షణాలు కనిపించగానే పశువైద్యాధికారిని గానీ, రైతు భరోసా కేంద్రాల్లో పశువైద్య సహాయకులను గానీ వెంటనే సంప్రదించాలని కోరారు.

వ్యాధులు– నివారణ చర్యలు

• గొంతువాపు వ్యాధి

ప్రస్తుతంలో ఆవులు, గేదెలు, ఎక్కువగా దూడలకు పాశ్చరెల్లా మల్టోసిడా అనే బ్యాక్టీరియా వల్ల గొంతువాపు వ్యాధి సోకుతుంది. పశువు నోటి నుంచి నురగ, తీవ్రమైన గురక వస్తుంది. 106 నుంచి 107 డిగ్రీల వరకూ శరీర ఉష్ణోగ్రత ఉంటుంది. జోరీగలు, దోమకాటు వల్ల ఇతర పశువులకు ఈ వ్యాధి సోకుతుంది. కళ్లు ఎరుపు రంగులోకి మారతాయి. గొంతు కింద భాగంలో నొప్పులతో కూడిన వాపు ఉంటుంది. నాసికా రంధ్రం నుంచి చిమిడి కారుతుంది. శ్వాస కష్టమై ఊపిరి అందక 48 గంటల్లో మృత్యువాత పడుతుంది. టీకాలు వేయించడం ద్వారా ఈ వ్యాధిని నివారించవచ్చు.

అరకు నియోజకవర్గంలో పశువుల వివరాలు

మండలం	గేదెలు	మేకలు	గొర్రెలు	పశువులు
దుంబ్రిగుడ	1967	30861	26270	28202
అరకులోయ	5899	22698	18392	36983
అనంతగిరి	4554	16404	30333	30323
హుకుంపేట	534	14243	10622	39930
పెదబయలు	5887	12935	11952	33894
ముంచంగిపుట్టు	5357	18540	7758	38736

• జబ్బువాపు వ్యాధి

ఆవులు, గేదెలకు క్లాస్ట్రీడియం చావై అనే బాక్టీరియాల్ సూక్ష్మజీవి వల్ల జబ్బువాపు వ్యాధి సోకుతుంది. ఆరు నెలల వయస్సు నుంచి మూడేళ్ల వయసు గల పశువుల్లోనూ, ఎక్కువగా బయటకు వెళ్లి మేత మేసే పశువులకు ఈ ఈవ్యాధి కనిపిస్తుంది. పశువులు తీవ్రమైన జ్వరం, ఆకలి మందగించడం, వేగమైన శ్వాస, నొప్పి వల్ల కుంటుతూ నడుస్తాయి. భుజం, తొడ వెలుపల నొప్పితో కూడి వేడి ఉంటుంది. వాపు నొక్కితే కండరాలు కరకరమంటూ శబ్దం వస్తుంది. ఈవ్యాధి సోకిన పశువులకు తక్షణ వైద్యం అందకపోతే 24–48 గంటల మధ్య మృత్యువాత పడతాయి.

• కాలిపుండ్ల (ఫూట్రాట్) వ్యాధి

వయస్సుతో ప్రమేయం లేకుండా గొర్రెలు, మేకలకు గిట్టల పుండ్లు, బురద పుండ్ల వ్యాధి సోకుతుంది. బురదలో తిరిగినపుడు జీవాల గిట్టల మధ్య చర్మం మెత్తబడి, వాచి, చిట్లిపోతుంది. వాటిని చిత్తడి నేలలో ఎక్కువ సేపు నడిపించకూడదు. సిమెంట్ బాత్ ఏర్పాటు చేసి, 4 శాతం పోడాకార్బ్ ద్రావణం పోసి, అందులోంచి జీవాల్ని ప్రతి రోజు 3–5 నిమిషాలు నడిపించాలి. పోటాషియం పర్మాంగనేటు (పీపీ లోషన్) ద్రావకంతో కడగాలి. వెంటనే యాంటిబైటిక్ ఇంజక్షన్ చేయించాలి.

• చిటుక వ్యాధి

గొర్రెలు, మేకల్లో క్లాస్ట్రీడియం ఫర్ ఫ్రీఫ్జెన్స్ అనే బ్యాక్టీరియా వల్ల చిటికె వ్యాధి సోకుతుంది. ఇది ఎక్కువగా ఏడాది వయసున్న గొర్రెల్లో సోకుతుంది. ఇది అత్యంత ప్రమాదకారి. అంటువ్యాధి.

పశువులకు వ్యాధులు సోకే సీజన్ ఇదే



రైతులు అప్రమత్తంగా ఉండాలి. పశువులకు వ్యాధులు సోకే సీజన్ ఇదే. ఈ కాలంలో రైతులు తమ పశు సంపదపై శ్రద్ధగా చూసుకోవాలి. వ్యాధుల లక్షణాలను గమనించిన వెంటనే పశు వైద్యాధికారిని సంప్రదించాలి. పశువులకు ముందుగా టీకాలు వేయాలి. అశ్రద్ధ చేస్తే పశువులు మృత్యువాత పడతాయి. గ్రామాల్లో పశు సంవర్ధక శాఖ నిర్వహించే పశు వైద్య శిబిరాల్లో రైతులు తమ పశువులకు టీకాలు వేయించుకోవాలి.

– అశ్వత్థామ, ఏడీ , దుంబ్రిగుడ

ఒకసారి సోకిందంటే క్షణాల్లో వ్యాప్తి చెందుతుంది. తొలకరి గడ్డి తినడం వల్ల, మురుగునీరు తాగడం వల్ల ఈ వ్యాధి సోకుతుంది. ముందుగా ముందు జాగ్రత్త చర్యగా టీకాలు వేయడమే ఈ వ్యాధికి నివారణ.

• పారుడు వ్యాధి

ముందస్తుగా గొర్రెలు, మేకలకు మూడేళ్లకు ఒకసారి పీపీఆర్ టీకాలు వేయించాలి. జ్వరం వస్తుంది. కళ్ల వెంబడి నీళ్లు కారతాయి. శరీర ఉష్ణోగ్రతలు ఎక్కువగా ఉంటాయి. తరచూ పారుతుంది.

• కొక్కెర వ్యాధి

కోళ్లకు సోకే ప్రమాదకర వ్యాధి. ఈవ్యాధి సోకిన కోళ్ల రెట్ట ఆకుపచ్చగా వేస్తుంది. మెడలు వంకర తిరగడం, రెక్కలు రెండూ వాల్చివేయడం, ఆకలి లేకపోవడం దీని లక్షణాలు, ఈ వ్యాధి వల్ల శ్వాస కోశ, జీర్ణ సంబంధ వ్యాధులు వస్తాయి. ముందు జాగ్రత్తగా ఆర్‌డీ వ్యాక్సిన్ టీకాలు వేయించడమే దీనికి నివారణ.

• మశూచి వ్యాధి

కోళ్లకు వైరస్ వల్ల మశూచి వ్యాధి వస్తుంది. కోళ్ల ముఖం మీద కుండలు వస్తాయి.
దీని నివారణకు ఎఫ్‌పీ వ్యాక్సిన్ టీకాలు వేయించాలి.

స్వామిదొర నియామకంపై హర్షం

రంపచోడవరం: రంపచోడవరం మండలం బీజేపీ మండల కార్యదర్శిగా కుంజం స్వామిదొరను జిల్లా పార్టీ నియమించింది. త్వరలోనే మండలంలోని అన్ని పంచాయతీల్లోను కార్యకర్తలతో కలిసి 60 మందితో మండల కమిటీ ఏర్పాటు చేయనున్నట్టు మండల పార్టీ అధ్యక్షుడు ముర్ల బాలురెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని అన్ని గ్రామాల్లో పర్యటించి పార్టీ అభివృద్ధికి కృషి చేస్తామన్నారు. ఈ సందర్భంగా స్వామిదొర నియామకంపై పలువురు హర్షం వ్యక్తం చేశారు.

స్వచ్ఛందంగా స్వచ్ఛభారత్



చెత్త తొలగిస్తున్న స్థానికులు

ఎటపాక: మండలం కేంద్రంలో సర్వేయర్ దీపిక ఆధ్వర్యంలో యువత ఆదివారం స్వచ్ఛందంగా స్వచ్ఛభారత్ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రహదారులు, దుకాణాల వద్ద ఉన్న చెత్తను శుభ్రం చేసి గ్రామ శివారుకు తరలించారు. ప్రతీ ఒక్కరు సేవా కార్యక్రమాలకు సహకారం అందించాలని సర్వేయర్ కోరారు. పరిసరాల పరిశుభ్రత అందరి బాధ్యత అని రోగాల నియంత్రణకు ప్రతీ ఒక్కరూ కృషి చేయాలని పిలుపునిచ్చారు.సతీష్, గ్రామ వలంటీర్లు, సర్పంచ్, పంచాయతీ కార్యదర్శి సహకారం అందించారు.

రహదారిపై వరద చెత్త

చింతూరు: చట్టి, చింతూరు ప్రధాన రహదారిపై వరద చెత్త పేరుకు పోయింది. గత జూలై, ఆగస్టు నెలల్లో వచ్చిన వరదలకు పలు ప్రాంతాల నుంచి భారీగా చెత్త కొట్టుకొచ్చింది. వరదలు తగ్గిన అనంతరం చింతూరు, చట్టి ప్రధాన రహదారిలో శబరినది వంతెన దిగువ నుంచి చట్టివైపు అర కిలోమీటరు మేర రహదారికి ఓ వైపు చెత్త అలాగే ఉండిపోయింది. దీంతో వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. చెత్త కారణంగా ప్రమాదాల బారిన పడుతున్నామని వారు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అధికారులు స్పందించి రహదారిపై పేరుకుపోయిన చెత్తను తొలగించాలని వారు కోరుతున్నారు.

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత



ఆలయాన్ని సందర్శించిన మాజీ మంత్రి బాలరాజు, వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు వెంకటలక్ష్మి

జి.మాడుగుల: ప్రతి ఒక్కరూ భక్తి భావం పెంపొందించుకోవాలని, ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత చేకూరుతుందని వైఎస్సార్‌సీపీ ఎస్టీ సెల్ రాష్ట్ర అధ్యక్షురాలు డాక్టర్ మత్స్యరాస వెంకటలక్ష్మి, మాజీ మంత్రి, వైఎస్సార్‌సీపీ నాయకుడు మత్స్యరాస బాలరాజు అన్నారు. గాంధీనగరం గ్రామంలో పంచముఖ ఆంజనేయ స్వామి దేవాలయంలో ఆదివారం భీమునిపట్నం సద్గురు సేవాశ్రమం పీఠం ప్రతినిధి స్వామిజీ ఆధ్వర్యంలో జరుగుతున్న జిల్లా స్థాయి భక్తి గీతాల భజన పోటీలను పరిశీలించారు. ఆలయంలో ఆంజనేయస్వామి వారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం వారు మాట్లాడుతూ ప్రజల్లో భక్తి భావం పెంపొందించటానికి, భజన పోటీలు నిర్వహించడం అభినందనీయమన్నారు. విశాఖపట్నం భీమిలి సద్గురు సేవాశ్రమం ప్రతినిధి సాయిరామ్ స్వామిజీ, వర్తక సంఘ నాయకుడు అర్జునరావు, పోటీల నిర్వాహకుడు మత్స్యరాజు, జీసీసీఎంఎస్ బ్రాంచి ఎస్ఎం సింహాచలం దంపతులు, వైఎస్సార్‌సీపీ నాయకుడు లకే నర్సింహామూర్తి తదితరులు పాల్గొన్నారు.

గుండెపోటుతో ఉపాధ్యాయుడు మృతి



మృతి చెందిన లూకరాజు

అడ్డతీగల: పెద్ద మునకనగడ్డ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తున్న కూరగాయని లూకరాజు(56) ఆదివారం గుండెపోటుతో మృతి చెందారు. అడ్డతీగలలో నివాసం ఉంటున్న ఆయన హఠాత్తుగా అస్వస్థతకు గురికావడంతో సామాజిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు. ఆస్పత్రి వైద్యుడు భాస్కర్ పరీక్షించగా లూకరాజు మార్గమధ్యలో మృతి చెందినట్టు నిర్ధారించారు. ఉపాధ్యాయుడు లూకరాజు మృతికి సహచర ఉపాధ్యాయులు తదితరులు సంతాపం తెలిపారు.

ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలని వినతి



ఆర్టీసీ డీఎం సీతారాంనాయుడుకు వినతిపత్రం అందజేస్తున్న ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ నేతలు

సాక్షి, పాడేరు : పాడేరు ఆర్టీసీ డిపోలో పనిచేస్తున్న డ్రైవర్లు, కండక్టర్లు, కార్మికుల న్యాయపరమైన సమస్యలు పరిష్కరించాలని ఆర్టీసీ వైఎస్సార్ ఎంప్లాయీస్ అసోసియేషన్ కార్యదర్శి బి.ఎస్.నారాయణ కోరారు. ఈ మేరకు ఆదివారం డిపో మేనేజర్ ఆర్.సీతారాం నాయుడుకు సమస్యలతో కూడిన వినతి పత్రాన్ని అందజేశారు. వారు మాట్లాడుతూ డిపోలోని బస్సులకు మరమ్మతులు చేపట్టి కండిషన్‌లో ఉండేలా చర్యలు తీసుకోవాలని, పర్మినెంట్ కండక్టర్లు ఉన్నప్పటికీ పాడేరు ఘాట్ మార్గంలో ఔట్ సోర్సింగ్ కండక్టర్లను నియమిస్తున్నారని, ఉద్యోగులు నివాసం ఉండే విశ్రాంతి గదులు పూర్తిగా మరమ్మతుకు గురై వర్షాలకు నీరు కారుతుందని, మరమ్మతులు చేపట్టాలని, డిపో పరిధిలోని మూడు ఉద్యోగ సంఘాలకు సమానంగా చూడాలని వినతిలో వారు కోరారు. కార్మిక సంఘం నేతలు పాల్గొన్నారు.

ఎమ్మెల్సీ దృష్టికి ఉపాధ్యాయుల సమస్యలు



ఎమ్మెల్సీకి సమస్యలపై వినతిపత్రాన్ని అందిస్తున్న ఉద్యోగులు

రంపచోడవరం: ఎమ్మెల్సీ షేక్ సాబ్జీ కోరారు. రంపచోడవరం యూటీఎఫ్ భవనంలో ఆదివారం జరిగిన సమావేశంలో మాట్లాడారు. ఆయన మాట్లాడుతూ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లో సమస్యలు పరిష్కరించాలన్నారు. రంపచోడవరం డైట్ కళాశాలలో పనిచేస్తున్న ఔట్ సోర్సింగ్ ఉపాధ్యాయులకు వేతన బకాయిలు చెల్లించాలని, గిరిజన ఆశ్రమ ఉపాధ్యాయులకు క్వార్టర్స్ నిర్మించాలని, డీవైఈవో పోస్టులు గిరిజన సంక్షేమ ఉపాధ్యాయులతో భర్తీ చేయాలని కోరారు. టీచర్లుకు హెల్త్ కార్డులు మంజూరు చేయాలని, మెస్ చార్జీల రేటు పెంచాలన్నారు. ఆయా సమస్యలను గిరిజన సంక్షేమశాఖ మంత్రి, ప్రిన్సిపాల్ సెక్రటరీ, కమిషనర్ల దృష్టి తీసుకువెళ్తామన్నారు. ఈ సందర్భంగా పలు సమస్యలపై ఉపాధ్యాయులు ఎమ్మెల్సీ సాబ్జీకి వినతిపత్రాన్ని అందజేశారు.

ఆదివాసీ చట్టాలు పరిరక్షించాలి



సమావేశంలో పాల్గొన్న దండకారణ్య విమోచన సమితి నాయకులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల ఆవరణలో ఆదివారం జరిగిన కార్యక్రమంలో దండకారణ్య విమోచన సమితి రాష్ట్ర అధ్యక్షుడు సమరెడ్డి మాణిక్యం పాల్గొన్నారు. ఆయన మాట్లాడుతూ ఆదివాసీల చట్టాలను పరిరక్షించాలన్నారు. గిరిజనులు చట్టాలు రోజురోజుకు నిర్వీర్యమవుతున్నాయని, కాపాడుకోవాల్సిన బాధ్యత మన్యవాసులపై ఉందన్నారు. భవిష్యత్‌లో ఆదివాసీల హక్కులు, చట్టాల పరిరక్షణపై ఉద్యమిస్తామన్నారు. కామేశ్వరరావు, జాని, ప్రసన్నకుమార్, శ్రీనివాస్, రమేష్, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు



కేక్ కట్ చేస్తున్న మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ చెట్టి వికాస్, అభిమానులు



రేఖపల్లి పీహెచ్‌సీలో రోగులకు పండ్లు పంపిణీ చేస్తున్న ప్రభాస్ అభిమానులు



లక్ష్మీపురంలో విద్యార్థులకు నోటు పుస్తకాలు పంపిణీ చేస్తున్న అభిమానులు

అరకులోయ రూరల్: మండల కేంద్రంలోని మన్య ప్రగతి చారిటబుల్ ట్రస్టు ఆధ్వర్యంలో సినీ నటుడు ప్రభాస్ జన్మదిన వేడుకలు ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ట్రస్టు చైర్మన్ చెట్టి వికాస్, ప్రభాస్ అభిమాన సంఘం నాయకులు కేక్ కట్ చేసి పంచిపెట్టారు. అనంతరం 700 మంది పేదలకు బిర్యానీ ప్యాకెట్లు పంపిణీ చేశారు. స్థానిక గర్భిణుల వసతి గృహంలో గర్భిణులకు పాలు, రొట్టెలు, పండ్లు పంపిణీ చేశారు. యండపల్లివలసలోని అనాథశ్రమంలో భోజనం ఏర్పాటుచేశారు. సంజూ, సాయిపవన్, రమేష్‌నాయుడు, సోనలి, సంగీత, లీల, దీపాలి, రూపాలి, కో–ఆప్షన్ సభ్యుడు రహ్మతుల్లా, వైఎస్సార్‌సీపీ నాయకులు కిరణ్, బలరాం, నొబో, సింహాచలం తదితరులు పాల్గొన్నారు.

వీఆర్ పురం: సినీ హీరో ప్రభాస్ జన్మదినాన్ని పురస్కరించుకొని అభిమానులు రేఖపల్లి పీహెచ్‌సీ కేంద్రంలో రోగులకు, వృద్ధులకు శనివారం పండ్లు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ప్రభాస్ ఫ్యాన్స్ అసోషియేషన్ మండల అధ్యక్షుడు శివ మాట్లాడుతూ ప్రభాస్ స్ఫూర్తితో సేవా కార్యక్రమాలు చేపడతామన్నారు. సత్యనారాయణ, శ్రీను, వెంకన్న, సురేష్, బాలు, వినోద్ తదితరులు పాల్గొన్నారు.

ఎటపాక: మండలంలోని లక్ష్మీపురం గ్రామంలో హీరో ప్రభాస్ జన్మదిన వేడుకలు ఆదివారం ఘనంగా జరిగాయి. అభిమానులు కేక్ కట్ చేసి స్వీట్లు పంచిపెట్టారు. ఈ సందర్భంగా ప్రభాస్ యువసేన ఆధ్వర్యంలో ఎంపీపీ పాఠశాల విద్యార్థులకు నోట్ పుస్తకాలు, పెన్నులు, బిస్కట్లు పంచిపెట్టారు. కార్తీక్, రాము, రాజు, నాగేశ్వరరావు, మధు, నాగేంద్ర, రంజిత్, రాంబాబు, రవి, నగేష్ తదితరులు పాల్గొన్నారు.

పూర్వ విద్యార్థుల ఔదార్యం



రాముడు కుటుంబానికి ఆర్థిక సహాయం అందజేస్తున్న స్నేహితులు

వీఆర్ పురం: తమతో పాటు చదువుకున్న స్నేహితుడు మృతి చెంది ఆ కుటుంబం ఆర్థికంగా ఇబ్బందులు పడుతుండడంతో చలించిన తోటి విద్యార్థులంతా కలిసి రూ.25వేల ఆర్థిక సాయం చేసి ఆ కుటుంబానికి బాసటగా నిలిచారు. మండలంలోని చింతరేవుపల్లి గ్రామానికి చెందిన కోట్ల రాముడు అనారోగ్యంతో గత వారం మృతి చెందారు. కాగా రాముడుకి భార్య యశోద, కుమారుడు, కుమార్తె ఉన్నారు. నాలుగేళ్ల వయసున్న కుమారుడు గౌతమ్ గుండె సంబంధిత వ్యాధితో బాధపడుతుండటంతో ఆ కుటుంబం దిక్కుతోచని స్థితిలో కొట్టుమిట్టాడుతుంది. మృతుడు రాముడు కుటుంబాన్ని ఆదుకునేందుకు అతనితో కలిసి చదువుకున్న (2003 బ్యాచ్) పదో తరగతి విద్యార్థులు ముందుకొచ్చారు. ఈ మేరకు రూ.25వేల నగదును సమకూర్చి బాధిత కుటుంబానికి అందచేశారు. స్నేహితుడి కుటుంబాన్ని ఆదుకొన్న వారిని గ్రామస్తులు అభినందించారు.

తెల్లజాతి పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు



లంపీ వ్యాధి సోకిన పశువు

రాజవొమ్మంగి: మండలంలోని లాగరాయి, రాజవొమ్మంగి, చికిలింత గ్రామాల్లో తెల్లజాతి పశువుల్లో లంపీ స్కిన్ వ్యాధి లక్షణాలు బయట పడుతున్నాయి. రాజవొమ్మంగి దుర్గానగర్ వద్ద రెండు పశువులకు ఈ వ్యాధి సోకగా చికిత్స చేయిస్తున్నారు. ఈ విషయంపై స్థానిక పశువైద్యాధికారి తరుణ్‌ను వివరణ కోరగా మండలంలో పలు గ్రామాల్లో పశువులకు లంపీ స్కిన్ లక్షణాలు కనిపిస్తున్నాయన్నారు. వాటి రక్త నమూనాలను పరీక్షకు పంపగా పాజిటివ్ వచ్చాయన్నారు. విషయం ఉన్నతాధికారులకు తెలియజేయడంతో మండలానికి అత్యవసరంగా 2,500 లంపీ స్కిన్ వ్యాధి నివారణ వ్యాక్సిన్‌లు వచ్చాయన్నారు. ఆదివారం నుంచి లాగరాయి, చికిలింత గ్రామాల్లో వ్యాక్సిన్ ప్రక్రియను ప్రారంభిస్తామన్నారు. మండలంలో దాదాపు 9వేల తెల్లజాతి పశువులు ఉండగా, ముందు జాగ్రత్త చర్యల్లో భాగంగా గ్రామాల వారీగా అన్ని పశువులకు వ్యాక్సినేషన్ చేపడతామన్నారు.

శిథిలావస్థలో పాఠశాల భవనం



ప్రాథమిక పాఠశాల భవనం దుస్థితి



రామాలయం అరుగుపై కొనసాగుతున్న తరగతులు

అడ్డతీగల: మండలంలోని కిమ్మూరు పంచాయతీలో సరంపేటపాడు మండల పరిషత్ పాఠశాల శిథిలావస్థకు చేరుకుంది. పాఠశాలలో ఒకటి నుంచి ఐదు తరగతులకు చెందిన 21 మంది విద్యార్థులు చదువుకుంటున్నారు. ఇద్దరు ఉపాధ్యాయులున్నారు. పాఠశాల భవనం శిథిలదశలో ఉండడంతో వర్షం కురిసినపుడు కారిపోతోందని, పెచ్చులూడుతున్నాయని స్థానికులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. లోతట్టు ప్రాంతంలో పాఠశాల ఉండడంతో వర్షాలు కురిసినపుడు ముంపునకు గురవుతోందని చెబుతున్నారు. ప్రస్తుతం పాఠశాలకు భవనం లేక గ్రామంలోని రామాలయంలో తరగతులు నిర్వహిస్తున్నారంటున్నారు. పాఠశాల సమస్యను పలుమార్లు అధికారులకు విన్నవించినా పట్టించుకోవడం లేదని ఇప్పటికైనా ఉన్నతాధికారులు స్పందించి సమస్య పరిష్కరించాలని వారు కోరుతున్నారు. ఈ విషయాన్ని ఎంఈవో వై.మల్లేశ్వరరావు వద్ద ప్రస్తావించగా సరంపేటపాడులో పాఠశాల భవనానికి నిధులు కోరుతూ నాడు–నేడు స్కీంలో ప్రతిపాదించామన్నారు. మూడవ విడతలో పాఠశాల భవనానికి నిధులు మంజూరయ్యే అవకాశాలున్నట్టు తెలిపారు.

మైనింగ్‌తో పర్యావరణానికి విఘాతం

అరకులోయ రూరల్: పర్యావరణ పరిరక్షణకు అందరు సహకరించాలని, మైనింగ్ తవ్వకాల వల్ల వాతావరణం కలుషితమవుతుందని, అధికారులు స్పందించాలని గిరిజన సంఘం నాయకులు కోరారు. దాబుగుడ అటవీ ప్రాంతంలో చేపట్టనున్న మైనింగ్ తవ్వకాలకు సంబంధించిన సర్వేను నిలుపుదల చేయాలని కోరుతూ స్థానికులు ఆదివారం ఆందోళన చేశారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ ఈ ప్రాంతంలో మైనింగ్ చేయడంతో పర్యావరణానికి విఘాతం కలుగుతుందని, సర్వేను నిలుపుదల చేయాలని కోరారు. సర్పంచ్‌లు దాసుబాబు, శ్రీనివాస్, గిరిజన సంఘం నాయకులు రామన్న, రమేష్ తదితరులు ఉన్నారు.